సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023



అసైన్డ్ భూములకు పట్టాలు

అసైన్డ్ భూములపై రైతులకు సర్వ హక్కులు కల్పిస్తూ పట్టాలు అందిస్తున్నట్టు ప్రభుత్వ సలహాదారు జూపూడి అన్నారు.


8లో ▸



ఖరీఫ్ 'స్వర్ణ'యుగం

ఖరీఫ్‌లో స్వర్ణ రకం సాగు చేసిన రైతుల పంట పండింది. ఎకరాకు 50 బస్తాల వరకు దిగుబడి వస్తుంది.

8లో ▸



ఎయిడ్స్‌ను తరిమికొడదాం

ఎయిడ్స్ లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువస్తున్నాయి.

8లో ▸

న్యూస్‌రీల్

అదనపు జిల్లా కోర్టు మంజూరుపై హర్షం



మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలుపుతున్న న్యాయవాదులు

ఉంగుటూరు: తాడేపల్లిగూడెంకు అదనపు జిల్లా కోర్టును మంజూరు చేయించినందుకు తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరు అప్పిరెడ్డి, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు గురువారం డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను గోపీనాథపట్నంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కోర్టు మంజూరులో మంత్రి కొట్టు కృషి ఎనలేనిదని కొనియాడారు. కోర్టు భవనం, ఉద్యోగుల నియామకం మంత్రి ఆధ్వర్యంలోనే జరుగుతాయని, త్వరలోనే కోర్టు ప్రారంభించేలా చూడాలని కోరారు. జిల్లా కోర్టు కోసం దూర ప్రాంతం వెళ్లాల్సిన అవసరం లేకుండా తాడేపల్లిగూడెం, పరిసర ప్రాంతాల ప్రజలకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయన్నారు. అద్దంకి విజయరత్నం, డీఎస్ రవిప్రసాద్, తోట రాంబాబు, మల్లపురెడ్డి రాము పాల్గొన్నారు.

ఇప్పటికే డివిజన్ కార్యాలయాలు

తాడేపల్లిగూడెంలో పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయాలు ఇప్పటికే మంజూరు చేయించానని మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాజాగా జిల్లా అదనపు కోర్టు మంజూరుతో తాడేపల్లిగూడెం పట్టణస్థాయి మరింత పెరిగిందన్నారు. న్యాయపరంగా రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చిందన్నారు. ఈ మేరకు సీఎం జగన్‌కు మంత్రి కొట్టు కృతజ్ఞతలు తెలిపారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



శ్రీవారి ఆలయ ఆవరణలో తనిఖీలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో గురువారం బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఆలయ భద్రతలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, ధ్వజస్తంభం, ఆలయ కార్యాలయం, మూల మండపాలు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. డాగ్, బాంబ్ హ్యాండ్లర్‌లు, సిబ్బంది బి.నాగేశ్వరరావు, ఆర్ జోసెఫ్, తంబి, ఎ.రాంబాబు, డాగ్ ట్రైనర్ పాల్గొన్నారు.

'ఓపెన్' ఫీజు గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల సప్లిమెంటరీ పరీక్షల ఫీజు గడువును పొడిగించినట్లు డీఈఓ పి.శ్యామ్ సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ అభ్యర్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.150, పదో తరగతి అభ్యర్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.100ను ఈనెల 31 వరకు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. వివరాలకు ఓపెన్ స్కూల్ అధీకృత స్టడీ సెంటర్లు లేదా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు.

క్షీరారామం.. మోక్షధామం



స్వామివారికి లక్షపత్రి పూజ చేసిన దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా గురువారం లక్షపత్రి పూజ చేశారు. పురోహితులు ఆర్.సత్యనారాయణ బ్రహ్మత్వంలో నెలవారీ పూజలు చేయించుకునే భక్తులచే కార్యక్రమం జరిపించారు. అనంతరం స్వామి వారి అభిషేకాలు మండపంలో శివలింగాకృతిలో దీపాలంకరణ చేశారు. పూజాదికాలు అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.


పంచాయతీల్లో నగదు కార్యకలాపాలు బంద్

ఏలూరు(మెట్రో): జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నగదు కార్యకలాపాలు బంద్ చేయాలని ఏలూరు డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 1 నుంచి అమలులోకి వస్తుందని, ఒకవేళ క్యూఆర్ కోడ్ పనిచేయకపోయినా, పాయింట్ ఆఫ్ సేల్ పరికరం లేకపోయినా పంచాయతీ ఆర్థిక లావాదేవీలను తర్వాత నిర్వహించాలన్నారు.

నిర్మాణం.. గృహత్తరం

- ఇళ్ల నిర్మాణం వేగవంతం
- జనవరి 24 నాటికి 15 వేల నిర్మాణాలు లక్ష్యం
- ఫిబ్రవరిలో రెండో విడత గృహ మహోత్సవాలు
- ఇప్పటికే 25,903 వేల ఇళ్లు పూర్తి
- వివిధ దశల్లో 37,568 నిర్మాణాలు

జిల్లాలో ఇళ్ల మంజూరు	నిర్మాణాలు పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్నవి	ప్రభుత్వం అందించిన సాయం	మౌలిక వసతుల కల్పన కోసం
71,283	25,903	37,568	రూ. 540 కోట్లు	రూ. 400 కోట్లు





దువ్వలోని జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు, (ఇన్‌సెట్‌లో) విస్సాకోడేరు లేఅవుట్‌లో నిర్మాణ దశలో..

భీమవరం(ప్రకాశం చౌక్): ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలాలు కేటాయించి గృహ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేశారు. అలాగే ఇంటి నిర్మాణాలకు ఆర్థికంగా, నిర్మాణ సామగ్రి రూపంతో సాయం అందిస్తున్నారు. దీంతో పశ్చిమగోదావరి జిల్లాలో గృహనిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారులు ఆనందంగా గృహప్రవేశాలు చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 25,903 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా దాదాపు అందరూ గృహప్రవేశాలు చేసుకున్నారు.

630 లేఅవుట్లలో..

వచ్చే ఏడాది జనవరి నెలఖారు నాటికి జిల్లావ్యాప్తంగా మరో 15 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు లక్ష్యంగా నిర్దేశించారు. రెండో విడత గృహమహోత్సవాలు ఫిబ్రవరిలో నిర్వహించనున్న నేపథ్యంలో 15 వేల ఇళ్ల ప్రారంభోత్సవం జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లాలోని 630 జగనన్న లేవుట్లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు వేగంగా పూర్తి చేయడానికి హౌసింగ్, సంబంధిత అధికారులతో ఆమె తరచూ సమీక్షలు నిర్వహిస్తూ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, స్టీల్, ఇసుక నిల్వలను లబ్ధిదారులకు అందుబాటులో ఉంచుతున్నారు.

లేఅవుట్ ఎంపిక

జిల్లాలోని 20 మండలాల్లో ప్రతి మండలంలో 100 ఇళ్ల నిర్మాణం చొప్పున పూర్తి చేయగలిగే లేవుట్ ఎంపిక చేసి వాటిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం తహసీల్దార్లు, మండల హౌసింగ్ అధికారులు సమన్వయం చేసుకుని గృహనిర్మాణాలు పూర్తిచేసేలా కార్యాచరణ అమలుచేస్తున్నారు.

71,283 ఇళ్ల మంజూరు

జిల్లావ్యాప్తంగా మొత్తం 71,283 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటివరకు 25,903 నిర్మాణాలు పూర్తయ్యాయి. బేస్‌మెంట్ నుంచి శ్లాబ్ పూర్తి వరకు వివిధ దశల్లో 37,568 నిర్మాణాలు ఉన్నాయి. నిర్మాణం పూర్తి చేసిన లేఅవుట్లకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. మంచినీటి పైపులైన్లు, విద్యుత్, అంతర్గత రోడ్ల నిర్మాణం చేస్తున్నారు. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణం కోసం రూ.540 కోట్లను ప్రభుతం ఖర్చు చేసింది. మౌలిక వసతులు కోసం మరో రూ.400 కోట్ల వరకు ఖర్చు చేశారు.

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు

మండలం	మంజూరు చేసిన ఇళ్లు	నిర్మాణం పూర్తి చేసుకున్నవి
ఆచంట	2,508	1,233
పెనుగొండ	3,528	1,271
పెనుమంత్ర	3,350	1,376
తాడేపల్లిగూడెం అర్బన్	3,577	1,189
పోడూరు	2,832	1,301
భీమవరం	1,691	913
భీమవరం అర్బన్	3,266	308
ఇరగవరం	2,563	1,266
తణుకు	4,175	1,311
మొగల్తూరు	2,202	1,342
ఆకివీడు	2,278	609
నరసాపురం అర్బన్	4,841	450
ఆకివీడు అర్బన్	1,342	304
నరసాపురం	2,984	967
పాలకొల్లు	1,298	884
ఉండి	2,889	1,271
కాళ్ల	1,040	774
తాడేపల్లిగూడెం	3,062	1,930
పెంటపాడు	2,283	1,296
గణపవరం	1,663	922
వీరవాసరం	1,548	768
యలమంచిలి	2,914	1,380
పాలకోడేరు	2,380	894
అత్తిలి	2,478	929
తణుకు అర్బన్	6,118	782
పాలకొల్లు అర్బన్	2,503	233

జిల్లావ్యాప్తంగా చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు



జిల్లావ్యాప్తంగా సొంత, లేఅవుట్లలో నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తయిన వారు గృహప్రవేశాలు చేసుకుంటున్నారు. వచ్చే ఏడాది జనవరి 24 తేదీ నాటికి మరో 15 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా లక్ష్యంగా పనిచేస్తున్నాం. రెండో విడత గృహ మహోత్సవాలకు జిల్లావ్యాప్తంగా అధిక సంఖ్యలో ఇళ్లు పూర్తి చేసి లేఅవుట్లను ప్రారంభించేలా చర్యలు తీసుకున్నాం. హౌసింగ్, మున్సిపాలిటీ, రెవెన్యూ తదితర శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పి.ప్రశాంతి, కలెక్టర్

ముఖ్యమంత్రి పర్యటనకు

పక్కా ఏర్పాట్లు

12న సీఎం జగన్ భీమవరం రాక



హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కమిటీ కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్, ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్)/భీమవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 12న భీమవరంలో పర్యటిస్తారని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం వేదికగా జగనన్న విద్యాదీవెన నిధులు విడుదల చేస్తారన్నారు. ఈ మేరకు గురువారం హెలీప్యాడ్, సభావేదిక ప్రాంతాలను సీఎం ప్రోగ్రాం కమిటీ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్‌తో కలిసి పరిశీలించారు. హెలీప్యాడ్ ఏర్పాటు చేయనున్న లూథరన్ హైస్కూల్ గ్రౌండ్, బహిరంగ సభ నిర్వహించనున్న బైపాస్ రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళాశాల వెనుక లేఅవుట్‌ను పరిశీలించారు. రఘురాం రూట్‌మ్యాప్‌ను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. హెలీప్యాడ్ నుంచి బైపాస్ రోడ్డు మీదుగా సభావేదికకు చేరుకునే మార్గంలో ట్రావెల్ బస్సుతో ట్రయిల్‌రన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించారు.

అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. హెలీప్యాడ్ నిర్మాణం, పటిష్ట బార్‌కేడింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలను చెప్పట్టాలని, లూథరన్ హైస్కూల్ గ్రౌండ్ ప్రాంతాన్ని శుభ్రం చేయించాలన్నారు. సీఎం పర్యటను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ కార్యాలయంలో తలశిల రఘురాం సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, జిల్లా వార్డు, సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, ఆర్అండ్‌బీ అధికారి బి.లోకేశ్వరరావు, కమిషనర్ ఎం. శ్యామల తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో తగ్గిన పేదరికం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా పేదలకు అందడంతో రాష్ట్రంలో పేదరికం 6 శాతానికి తగ్గిందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంచిలిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇంటి పట్టాతో పాటు గృహనిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. ఎస్సీల శ్మశాన వాటికలకు స్థలాలను సమకూర్చి వారి సమస్యకు మోక్షం కలిగించిందన్నారు. అసైన్డ్ భూముల రైతులకు భూమిపై సర్వహక్కులు కల్పించేలా సీఎం జగన్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. గత టీడీపీ పాలనలో పేదలకు పంచాల్సిన సొమ్మును దోచుకో.. దాచుకో.. పంచుకో విధానంలో టీడీపీ పెద్దల జేబుల్లోకి వెళ్లాయని విమర్శించారు. అయితే సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీ సుకు వచ్చేలా ప్రజలంతా తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం మండలంలో 16 మందికి ఇళ్ల పట్టాలు, తణుకు నియోజకవర్గ పరిధిలో 15 మందికి అసైన్డ్ భూముల పట్టాలు, 9 గ్రామాలకు ఎస్సీ శ్మశాన వాటికలకు పత్రాలను మంత్రి కారుమూరి అందజేశారు. తాడేపల్లిగూడెం ఆర్డీఓ కె.చిన్నయ్య మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్ర సాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జా నకి, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ చింతా రామయ్య, ఎంపీటీసీ శిరీషా, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు రామరాజు పాల్గొన్నారు.

చట్టబద్ధంగానే దత్తత స్వీకరణ

ఏలూరు(మెట్రో): అనాథ బాలలను పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చే ప్రక్రియలో నియమ నిబంధనలకు అనుగుణంగా చట్టబద్ధంగా దత్తత స్వీకరణ జరుగుతుందని ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రాష్ట్ర దత్తత వనరుల సంస్థ, జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత ప్రక్రియపై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా ఐసీడీఎస్ పీడీ కేఎల్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో అనాథ బాలలను శిశు గృహాల ద్వారా సంరక్షిస్తున్నామని, నిబంధనల మేరకే దత్తత ఇస్తామన్నారు. దత్తత చేసుకున్న పిల్లల భవిష్యత్, సంరక్షణ బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వారికి విద్యావకాశాలు కల్పించి తీర్చిదిద్దాల్సి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వాటిని పోలీస్ శాఖ ద్వారా పరిశీలన చేసి కలెక్టర్ సమక్షంలో పిల్లలను దత్తత ఇస్తామన్నారు. దత్తత ప్రక్రియపై అవగాహన కల్పించేలా రాష్ట్ర, జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు.

అవగాహన తప్పనిసరి : కారా సంస్థ (న్యూఢిల్లీ) చీఫ్ కన్సల్టెంట్ అనూషశర్మ మాట్లాడుతూ పిల్లలను దత్తత పొందేందుకు అర్హతలు, దత్తత చేసుకునే విధానం, పాటించాల్సిన నియమాలు, చైల్డ్ మ్యాచింగ్ ప్రక్రియ తదితర విషయాలపై మాట్లాడారు.

దాళ్వాకు సన్నద్ధం

- 2.23 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 52 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- నారుమడుల్లో రైతులు నిమగ్నం
- 36 వేల టన్నుల ఎరువులు సిద్ధం



దాళ్వా నారుమడుల పనుల్లో రైతులు

భీమవరం: జిల్లాలో దాళ్వా సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే 20 మండలాల్లో ఓ పక్క ముమ్మరంగా సార్వా మాసూళ్లు జరుగుతుండగా మరోపక్క దాళ్వా నారుమడుల పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. కొందరు నారుమడుల పనులు పూర్తిచేయగా మిగిలిన వారు దమ్ములు చేయించడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది లోటు వర్షపాతంతో సాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వంతులవారీ విధానంలో పూర్తి స్థాయిలో నీరందిస్తామని ప్రభుత్వం ప్రకటించడం, సార్వా దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతులు మరింత ఉత్సాహంతో దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు.

సబ్సిడీపై విత్తనాలు : తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు, పాలకొల్లు, వీరవాసరం, గణపవరం, ఇరగవరం తదితర మండలాల్లో రైతులు నారుమడులు వేస్తున్నారు. జిల్లాలో 2.23 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా.. సుమారు 52 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అధికారులు గుర్తించారు. ఈ సీజన్‌లో రైతులు సొంతంగా సాగుచేసుకున్న విత్తనాలనే ఉపయోగిస్తారని చెబుతున్నారు. జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల ద్వారా 3 వేల క్వింటాళ్ల విత్తనాలను కిలో రూ.5 సబ్సిడీపై విక్రయించడానికి సిద్ధం చేశారు. నెలాఖరుకు దాళ్వా వరినాట్లు పూర్తి చేయించాలనే సంకల్పంతో వ్యవసాయశాఖ రైతులను ప్రోత్సహిస్తోంది. విత్తనాల ధర కిలో రూ.37.30 కాగా రైతులకు సబ్సిడీపై సరఫరా చేస్తారు.

మేలైన రకాలివే.. దాళ్వాలో ఎంటీయూ 1121, ఎంటీయూ 1156, ఎంటీయూ 1153 వరి వంగడాలపై రైతులు ఆసక్తి చూపడంతో వ్యవసాయశాఖ కూడా వాటినే సిఫార్సు చేసింది.

సమృద్ధిగా ఎరువులు : దాళ్వా సాగులో సుమారు 54,500 టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు గుర్తించారు. ఇప్పటికే 36 వేల టన్నుల ఎరువులను రైతు భరోసా కేంద్రాలు, సహకార సంఘాలు, డీలర్లు, వ్యాపారుల వద్ద సిద్ధం చేశారు. అలాగే యూరియా 17 వేల టన్నులు, డీఏపీ 6 వేల టన్నులు, ఎంఓపీ 4 వేల టన్నులు, కాంప్లెక్ ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

పటిష్ట ప్రణాళికతో..



జిల్లాలో దాళ్వా సీజన్‌కు పూర్తి ప్రణాళిక సిద్ధం చేశాం. సుమారు 2.23 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ఈ మేరకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సిద్ధం చేశాం. వంతుల వారీ విధానంలో సాగునీటిని సరఫరా చేస్తున్నందున రైతులు నీటిని వృథా చేయకుండా నెలాఖరు నాటికి నాట్లు పూర్తి చేయాలి. దీని వల్ల అధిక దిగుబడులు పొందే అవకాశముంటుంది. విత్తనాలు, ఎరువుల కోసం వ్యవసాయ శాఖను సంప్రదించవచ్చు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి


ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాసరావు

ఆగిరిపల్లి: గ్రామానికి చెందిన మెరుగుమాల శ్రీనివాసరావు గురువారం ఈదులగూడెం పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొని మృతి చెందాడు. ఆగిరిపల్లికి చెందిన శ్రీనివాసరావు గొల్లనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఎన్‌ఓగా పనిచేస్తున్నాడు. ఉద్యోగ నిమిత్తం గురువారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై గొల్లనపల్లి వెళ్తుండగా ఈదులగూడెం పెట్రోల్ బంక్ వద్ద నూజివీడు నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తలకు బలమైన గాయమవడంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై చంటిబాబు లారీ డ్రైవర్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేశారు.

11 మోటారు సైకిళ్ల స్వాధీనం

తణుకు: తణుకు మండలం ముద్దాపురంలో 11 మోటారు సైకిళ్లను బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలోని ద్విచక్ర వాహనాలు ఎప్పటి నుంచో ఉన్నట్లు వచ్చిన సమాచారంతో ఆరా తీయగా అవి ఎవరికీ సంబంధించినవి కావని తేలడంతో వీఆర్వో సమక్షంలో పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. సంబంధిత వాహనాలకు సంబంధించి యజమానులు ఉంటే పత్రాలు తీసుకువచ్చి పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం అర్బన్: గణపవరం మండలానికి చెందిన వ్యక్తి తాడేపల్లిగూడెంలో చెట్టుపై నుంచి పడి మృతిచెందాడు. గణపవరం మండలం కాల్పుపల్లికి చెందిన ఈదుపల్లి వెంకటరామారావు (59)విశ్వంరాజు ఇంటికి అప్పు అడిగేందుకు తాడేపల్లిగూడెం వచ్చాడు. అప్పు ఇస్తానని.. ఇంటి ముందు ఉన్న చెట్టు కొమ్మలను నరకమని వెంకటరామారావుకు విశ్వంరాజు చెప్పాడు. అయితే వెంకటరామారావు చెట్టుపై నుంచి అదుపు తప్పి కిందపడిపోయాడు. విషయాన్ని దాచిపెట్టిన వెంకటరామారావు విశ్వంరాజు భార్యకు ఫోన్ చేసి ప్రమాదం జరిగిందని సమాచారం అందించాడు. భార్య వచ్చేసరికి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశ్వంరాజు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆమె తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీఫ్ దిగుబడి 'స్వర్ణ'యుగం

46 నుంచి 50 బస్తాలకు పైగా దిగుబడి

ఆకివీడు: ఈ ఖరీఫ్‌లో స్వర్ణ రకం రైతుల పంట పండింది. ఖరీఫ్‌కు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలించడంతో స్వర్ణ రకం దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఎంటీయూ స్వర్ణ, సంపద స్వర్ణ వంగడాలు ఎకరాకూ 46 బస్తాల వరకూ దిగుబడినిచ్చింది. పలు చోట్ల 50 బస్తాలు కూడా పండింది. మార్టేరు వరి పరిశోధనా సంస్థ(ఎంటీయూ) రూపొందించిన 7029, 1318, 1061, 1064,1121 వంగడాలతో పాటు సంపద స్వర్ణ, పీఆర్ 126 రకాల్ని ఈ సారి సాగు చేశారు. జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో అధిక దిగుబడులు వచ్చాయి. డెల్టా ప్రాంతంలో కూడా అక్కడక్కడా అధిక దిగుబడులతో మాసూళ్లు పూర్తి చేస్తున్నారు. వర్షాలకు పడిపోయి మునిగిపోతుందని, గాలికి ఒరిగిపోతుందని పొట్టిగా ఉండే స్వర్ణ రకం వంగడాన్ని రైతులు తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 44 వేల ఎకరాల్లో స్వర్ణ సాగు చేయగా 1318 వంగడం 50 వేలకు పైగా ఎకరాల్లో, సంపద స్వర్ణ 35 వేల ఎకరాల్లోనూ, పీఆర్ 126 వంగడం ఆరు వేల ఎకరాల్లో, సాగు చేశారు. దాళ్వా విత్తనాల కోసం, ఇతరత్రా వంగడాల్ని సాగు చేశారు.

ఎకరాకూ రూ.4 వేల మిగులు

వాతావరణం అనుకూలించడంతో ఎకరాకూ నాలుగు వేలకు పైగా రైతులకు పెట్టుబడి మిగిలింది. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే కురిశాయి. చీడపీడలకు మందుల వాడకం, ఎరువుల వాడకం తగ్గింది. ఎరువులు, పురుగు మందులు అంతంత మాత్రంగానే ఖరీఫ్‌లో పిచికారీ చేశారు. దీంతో నాణ్యమైన గింజలు ఉత్పత్తయ్యాయి. పెట్టుబడులు తగ్గడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

పండగలా వ్యవసాయం

గత ప్రభుత్వాలు వ్యవసాయాన్ని దండగగా మార్చితే, జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయం పండగగా మార్చింది. గత పదేళ్ళ సరాసరి దిగుబడుల్ని పరిశీలిస్తే ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో వ్యవసాయం చేసేందుకు రైతులు మళ్ళీ ముందుకు వస్తున్నారు. లీజుల కోసం వరి భూముల్ని వెదుకుతున్నారు. రైతులడిగిన లీజును చెల్లించి పంట భూముల్లో వరి సాగుకు సిద్ధమవుతున్నారు.



జిల్లాలో వరి సాగు- రకాలు					
ఎంటీయూ 7029	: 44 వేలు	1061	: 24 వేలు	ఇతర వంగడాల సాగు	: 39 వేలు
1318	: 60 వేలు	1064	: 22 వేలు	మొత్తం సాగు	: 2.11 లక్షల ఎకరాలు
		1121	: 14 వేలు		
		ఐఆర్ 126	: 8 వేలు		

మంచి దిగుబడులు



ఈ ఖరీఫ్‌లో మంచి దిగుబడులొస్తున్నాయి. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. వాతావరణం అనుకూలించడం, చీడపీడలు తగ్గడంతో పాటు మొక్క కణుపులు అధికంగా వేసింది. రైతులు ఎరువులు, పురుగు మందులు తక్కువగా వాడారు. దిగుబడులు అంచనా వేయగా స్వర్ణ వంగడం ఎకరాకూ 46 బస్తాల నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి వస్తుంది.

– జెడ్ వెంకటేశ్వర్లు, జేడీ, వ్యవసాయ శాఖ, పశ్చిమగోదావరి జిల్లా

కౌలు పొలాల కోసం వెదుకులాట



ఇటీవల వ్యవసాయం పండుగగా మారడంతో పలు ప్రాంతాలకు చెందిన రైతులు వ్యవసాయ భూముల లీజు(కౌలు) కోసం గ్రామాల్లో తిరుగుతున్నారు. వరి సాగుకు అనువైన భూములు లీజుకు కావాలని వెతుకుంటున్నారు. అన్నదాతకు మంచి రోజులు వచ్చాయి.

– వీ నారాయణ రావు, వ్యవసాయాధికారి, పాలకోడేరు మండలం

స్వర్ణ బంగారమే



ఈ ఖరీఫ్‌లో ఎంటీయూ 7029 స్వర్ణ వంగడం 2.86 ఎకరాల్లో సాగు చేశాను. వర్షాలు కురవకపోవడంతో చేను ఏపుగా ఎదిగింది. ఎరువులు, పురుగు మందులు తక్కువగా వాడాను. ఎకరాకూ 46 బస్తాల దిగుబడి వచ్చింది. ఎంతో ఆనందంగా ఉంది.

– పాలా శ్రీనివాసరావు, వేండ్ర, పాలకోడేరు మండలం

మహిళలకు స్వయం ఉపాధి అవసరం


చాక్లెట్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: మహిళలు స్వయం సమృద్ధి ద్వారా ఆర్థికంగా పరిపుష్టం కావాలని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవర్సిటీ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ పిలుపునిచ్చారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద విడుదల చేసిన నిధులతో ఉద్యానవర్సిటీలో స్వచ్ఛ చాక్లెట్ల తయారీ మార్కెటింగ్‌పై 60 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కలిగేలా, వారి పరపతి పెరిగేలా తగిన నైపుణ్యశిక్షణను ఉద్యానవర్సిటీ నిర్వహిస్తోందన్నారు. ఇంతవరకు ఎండుపూలతో అలంకరణ వస్తువుల తయారీ, తేనె పట్టు నుంచి తయారుచేసిన వివిధ ఉత్పత్తులు తదితరాలపై శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాల గురించి వివరించామన్నారు. జంగారెడ్డిగూడెం, నల్లజర్ల, ఆవపాడు, తెలికిచర్ల, పెదతాడేపల్లి, ప్రకాశరావుపాలెం, సింగరాజుపాలెం గ్రామాలకు చెందిన 200 మందికి చాక్లెట్ల తయారీపై అవగాహన కల్పించారు. 25 మంది మహిళలకు 45 రోజుల పూర్తిస్థాయి శిక్షణనిచ్చారు. 12.7 లక్షల గ్రాంటును ఈ శిక్షణ కోసం ఐసీఏఆర్ ఇచ్చింది. డాక్టర్ కల్పన, డాక్టర్ మాధవి, ఉద్యాన వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

దాతల సాయం కోసం ఎదురుచూపులు

డిగ్రీ విద్యార్థికి అరుదైన బ్లడ్ క్యాన్సర్


బ్లడ్ క్యాన్సర్‌తో బసవతారకం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సరిదే వర్షిత్

ద్వారకాతిరుమల: సరదాగా ఆడుతూ.. పాడుతూ.. గడపాల్సిన ఆ యువకుడు అరుదైన క్యాన్సర్ బారిన పడ్డాడు. వైద్యానికి రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తేల్చి చెప్పారు. దాంతో ఖరీదైన వైద్యం చేయించే స్తోమత లేక అతడి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. దాతల చేయూత కోసం ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలోని సీసీ కెమేరాల విభాగంలో ఆపరేటర్‌గా (అవుట్ సోర్సింగ్) పనిచేస్తున్న సరిదే జగదీష్ కుమారుడు వర్షిత్ ఏలూరులోని ఆదిత్య కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. 10 రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆ యువకుడిని కుటుంబ సభ్యులు తొలుత విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు వర్షిత్ అరుదైన బ్లడ్ క్యాన్సర్ (ఏఎంఎల్) బారినపడినట్టు నిర్ధారించారు. మెరుగైన చికిత్స అవసరమని సూచించడంతో, వెంటనే అతడిని హైదరాబాద్‌లోని బసవతారకం ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్సకు రూ. 15 లక్షల వరకు ఖర్చవుతుందని, ఆరోగ్యశ్రీ వర్తించదని తేల్చి చెప్పారు. దాంతో కుటుంబ సభ్యులు అప్పులు చేసి తెచ్చిన రూ. 3 లక్షలు, దాతల నుంచి సేకరించిన మరో రూ.2 లక్షలతో ప్రస్తుతం వైద్యం చేయిస్తున్నారు. ఇంకా వైద్యానికి కావాల్సిన రూ. 10 లక్షల కోసం వర్షిత్ కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. దాతల చేయూత కోసం ఎదురు చూస్తున్నారు. తమ బిడ్డ ప్రాణాలను నిలబెట్టాలని వేడుకుంటున్నారు. ఆర్థిక సహాయం చేయదలచిన దాతలు 63037 42645 నెంబర్‌లో సంప్రదించాలని కోరుతున్నారు.

ఫర్నిచర్ గోడౌన్ దగ్ధం


పెంచికలమర్రులో దగ్ధమైన ఫర్నిచర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: గృహోపకరణాల గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి రూ.70 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటన పెంచికలమర్రులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన బలే వీరబాబు ఫర్నిచర్ దుకాణాన్ని నడుపుతున్నాడు. దుకాణం వెనుక భాగంలో గోడౌన్‌లో ఫ్రిజ్, టీవీలు, ఇన్వర్టర్లు, మంచాలు, కూలర్‌లు ఇలా గృహపకరణాలు నిల్వ చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయి. గుర్తించిన ప్రజలు కైకలూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ క్రాంతికుమార్, సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. సర్పంచ్ జయమంగళ కాసులు, సర్కిల్ సీఐ కృష్ణకుమారి, రూరల్ ఎస్ఐ జ్యోతిబసు, విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ పి.నాగేశ్వరరావు, గ్రామపెద్దలు ఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటనను తెలుసుకున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హుటాహుటీన పెంచికలమర్రు చేరుకున్నారు. దగ్ధమైన గోడౌన్ పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందించడానికి కృషి చేస్తానని చెప్పారు.

● గడపగడపకు సంక్షేమం


ఉండి : ఉండిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

21 కిలోల గంజాయి పట్టివేత

యలమంచిలి: 214 జాతీయ రహదారి పక్కన ఉన్న రుద్రరాజు సుబ్బరాజు అరటితోటలో గురువారం 21 కిలోల 320 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం జాతీయ రహదారి పక్కన గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో నిఘా ఉంచారు. ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా అరటితోటలోకి వెళ్లడంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి పొట్లం లభించడంతో అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఒకరు ఉల్లంపర్రుకు చెందిన మైనర్ బాలుడు కాగా, మరో ఇద్దరు రాజమండ్రికి చెందిన వాసంశెట్టి లక్ష్మణ్, పంచకట్ల గౌరీ పరమేశ్ చరణ్‌గా గుర్తించారు. మైనర్ బాలుడిని ఏలూరు జువైనల్ హోంకు, ఇద్దరు నిందితుల్ని నరసాపురం కోర్టుకు తరలించారు. పాలకొల్లు సీఐ కె.సతీష్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ వివరించారు.

విద్యార్థినిని కొట్టిన ఉపాధ్యాయుడు

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో ఆదిత్య విద్యానికేతన్ స్కూలులో ఉపాధ్యాయుడు వరుణ్ 6వ తరగతి విద్యార్థినిని ప్రశ్నలకు సమాధానం చెప్పలేదని కొట్టారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బాలిక వీపుపైన, మెడ, శరీరంపై దెబ్బలు తట్టు తేలాయి. దీనిపై సాయితేజస్వి తల్లిదండ్రులు స్కూలు వెళ్ళి ప్రశ్నించగా సరిగా చదవకపోతే అలాగే చర్యలు తీసుకుంటామని, మీకు సమాధానం చెప్పాల్సిన పనిలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. టీసీ ఇచ్చేస్తామని బెదిరిస్తున్నట్లు బాలిక తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థినిని కొట్టిన ఉపాధ్యాయుడు వరుణ్, స్కూలు చైర్మన్ గోపిచంద్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలు చారిత్రక ఘట్టం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్


చింతలపూడిలో నిషేధిత జాబితా నుంచి తొలగించిన అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

చింతలపూడి : రాష్ట్రంలో మరో చారిత్రక ఘట్టానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం 2003కు ముందు పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములపై సర్వహక్కులు కల్పిస్తూ ఏర్పాటు చేసిన పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలను ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎలీజా అధ్యక్షతన జరిగిన సభలో జూపూడి మాట్లాడుతూ భూములపై నిరుపేదలకు సర్వ హక్కులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. మనసున్న ముఖ్యమంత్రి కాబట్టే జగన్మోహన్‌రెడ్డి ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయంతో లక్షలాది మంది పేద లబ్ధిదారులకు సర్వహక్కులు ఏర్పడ్డాయని తెలిపారు. రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుంటే ఒకాయన హైదరాబాద్‌లో కూర్చొని అసైన్డ్ భూములకు సర్వ హక్కులు కల్పిస్తే భూములు అమ్ముకుని తాగిపాడు చేస్తారని బాధపడి పోతున్నాడని చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. మరొకరు అప్పుడప్పుడూ ఉడత ఊపులు ఊపి మళ్ళీ సినిమాల్లోకి వెళ్ళి పోతుంటాడని పవన్ కళ్యాణ్‌ను విమర్శించారు.

జగన్మోహన్‌రెడ్డి పాలనలో మరో మైలురాయి

ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో మరో మైలురాయిని చేరుకున్నారన్నారు. రెండు దశాబ్దాలుగా సాగు చేసుకుని అనుభవిస్తున్న అసైన్డ్ భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అసైన్డ్ భూములను అమ్ముకోవద్దని సూచించారు. సాగు చేసుకుని సామాజికంగా, ఆర్థికంగా బలపడాలని కోరారు. నియోజకవర్గంలో 2098 మంది రైతులకు 3,761 ఎకరాల నిషేధిత జాబితాలో ఉన్న భూములకు, ఎస్సీ కార్పరేషన్ ద్వారా గతంలో పంపిణీ చేసిన 181.79 ఎకరాల భూమిని 277 మంది రైతులకు పట్టాలు అందచేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా 38 మంది రైతులకు 22.61 ఎకరాల భూమికి పట్టాలు పంపిణీ చేశారు. చింతలపూడి, లింగపాలెం, జంగారెడ్డిగూడెం మండలాల్లో ఎస్సీల శ్మశాన వాటికల కోసం 5.75 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పండు జగదీష్, తహసీల్దార్ కృష్ణ జ్యోతి, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, నాలుగు మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం

- ఉమ్మడి పశ్చిమలో 8,228 మందికి చికిత్స
- 1728 మంది బాధితులకు పెన్షన్ల పంపిణీ


ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ (ఫైల్)

ఏలూరు టౌన్: మహమ్మారి ఎయిడ్స్‌ను నిర్మూలించేందుకు అందరూ ఏకం కావాలి.. నేడు ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం జరుపుకుంటున్నాం. ఎయిడ్స్ లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయి. ఎయిడ్స్ బాధితుడ్ని చూస్తేనే భూతంలా పారిపోయే పరిస్థితులకు భిన్నంగా ఎయిడ్స్ బాధితులకు అండగా నిలబడుతూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ కొత్త జీవితంపై ఆశలు చిగురించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఆధునిక వైద్య చికిత్స, మందులు, పరీక్షలతో ఎయిడ్స్‌ను సమూలంగా రూపుమాపేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

ఎయిడ్స్‌పై ప్రజల్లో చైతన్యం

దేశంలోని హెచ్‌ఐవీ బాధితుల్లో 55 శాతం మంది దక్షిణ భారతంలోని ఐదు రాష్ట్రాల్లోనే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడులోనే అత్యధిక కేసులు ఉన్నట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చూస్తే గత 12 ఏళ్లలో సుమారుగా 14.88 లక్షల మంది హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోగా, వారిలో 29 వేలకు పైగా పాజిటివ్ కేసులు ఉన్నట్లు నిర్ధారించారు. ప్రజల్లో ఎయిడ్స్ పట్ల చైతన్యం రావడంతో ఏదైనా లక్షణాలు కనిపిస్తే పరీక్షలకు వెళ్తున్నారు.

ఈ ఏడాది 366 మందికి పాజిటివ్

ఏలూరు జిల్లాలో 2023లో 32,025 మంది ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోగా వారిలో 366 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారించారు. ఏలూరు జిల్లాలో 3 ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు వైద్య చికిత్సలు, మందులు పంపిణీ చేస్తున్నారు. ఏలూరు జీజీహెచ్, ఆశ్రం మెడికల్ కళాశాల, జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్స్‌లో ఏఆర్‌టీ సెంటర్లు ఉన్నాయి. జిల్లాలో 8228 మంది హెచ్‌ఐవీ బాధితులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో 1728 మంది బాధితులకు ఎయిడ్స్ కేటగిరీలో పెన్షన్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లా ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ) బృందం జిల్లాలో పర్యటిస్తూ బాధితులకు పరీక్షలు చేస్తూ సూచనలు, సలహాలు ఇస్తోంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై నిత్యం ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాం. హెచ్‌ఐవీ సోకిన గర్భిణికి 14వ వారం నుంచి నూతన చికిత్స విధానాన్ని అమలు చేస్తున్నాం. ఈ నూతన విధానంతో తల్లి నుంచి బిడ్డకు హెచ్‌ఐవీ వచ్చే అవకాశాన్ని 30 శాతం నుంచి 5 శాతానికి తగ్గించవచ్చు. జిల్లాలోని 8 బ్లడ్‌బ్యాంకుల నుంచి 78 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 4,846 యూనిట్ల సురక్షిత రక్తాన్ని సేకరించి, వినియోగించాం. ఎయిడ్స్ బాధితులు వివక్షకు గురికాకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ అండగా నిలబడేలా స్వచ్ఛంద సేవాసంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తోంది.

–డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి

గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ

ఏలూరు జిల్లాలో 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ 15,389మంది గర్భిణులకు హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తే వారిలో 11 మందికి పాజిటివ్‌గా నిర్ధారించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 46,617 మంది గర్భిణులకు హెచ్‌ఐవీ పరీక్షలు చేస్తే వారిలో 23 మందికి హెచ్‌ఐవీ ఉన్నట్లు గుర్తించారు. 18 మంది హెచ్‌ఐవీ సోకిన గర్భిణులకు ప్రసూతి చేయగా, చిన్నారులంతా ఆరోగ్యవంతంగా ఉన్నారు. వారికి ఎలాంటి వ్యాధి సోకలేదని వైద్యులు నిర్ధారించారు.

బైక్ దొంగల అరెస్టు


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో దొంగలు

ఇరగవరం: వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు స్నేహితుల నుంచి పోలీసులు 9 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తాడేపల్లిగూడెం డీఎస్పీ సి.శరత్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల ఇరగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న వరుస మోటర్ సైకిల్ దొంగతనాలపై ఎస్పీ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం డివిజన్ పరిధి, తణుకు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో మూడు క్రైం టీంలు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. బుధవారం ఇరగవరం మండలం ఏలేటిపాడు సెంటర్‌లో తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఆశెట్టి నాగేష్, పెంటపాడు మండలం మీనవల్లూరుకు చెందిన ముదరబోయిన దుర్గారావు, ఆకివీడు మండలం కోళ్ళపర్రు గ్రామానికి చెందిన తాడిపర్తి దుర్గారావు అనే ముగ్గురు స్నేహితులు బైక్‌లు చెకింగ్ చేస్తుండగా ఇరగవరం ఎస్సై డి.ఆదినారాయణకు అందిన సమాచారంతో వెళ్ళి ముగ్గురిని అదుపులోనికి తీసుకున్నారు. వారి నుంచి రూ. 7.50 లక్షలు విలువ చేసే 9 మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఇతర జిల్లాల్లో చోరీకి గురైన బైక్‌లు రెండు ఉండగా మిగిలినవి అత్తిలి, ఇరగవరం, తణుకు రూరల్ ప్రాంతాల్లో చోరీకి గురైనవిగా గుర్తించారు.

క్లుప్తంగా

షిర్డీ సాయిబాబా ఉత్సవాలకు హాజరైన మంత్రి కారుమూరి



అత్తిలిలో సాయిబాబాను దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: నాయిబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో అత్తిలి మార్కెట్ వద్ద నిర్వహిస్తున్న షిర్డీసాయిబాబా ఉత్సవాలకు గురువారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరై బాబాను దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మంత్రి కారుమూరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, చిటకన వెంకట్రావు, కంకటాల సతీష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో ఎస్ఈబీ అధికారుల తనిఖీలు



తణుకులో కర్మాగారాల్లో తనిఖీలు చేస్తున్న ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖల అధికారులు

తణుకు: తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కర్మాగారాల్లో ఎస్ఈబీ ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు గురువారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రాసుగర్స్, వాన్‌బరీ, ఫ్లూటస్ కర్మాగారాల్లో ఆర్ఎస్, మిథనాల్ యూనిట్లు తనిఖీ చేసిన అధికారులు సంస్థ యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఆర్ఎస్, మిథనాల్ విషయంలో అజాగ్రత్త వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి ట్యాంకర్లు దిగుమతి, ఎగుమతి సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో తణుకు ఎస్ఈబీ సీఐ ఆర్.సత్యవతి, ఎస్సై టి.వెంకటేశ్వరరావు, ఆంధ్రాసుగర్స్ డిస్టిలరీ అధికారి లక్ష్మీతులసి పాల్గొన్నారు.

రామన్నగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని రామన్నగూడెం, పెదతాడేపల్లి గ్రామాల్లో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించే లక్ష్యంతో సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలు అందని వారు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, సర్పంచ్ చింతా వెంకట్రావు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ రామగాని భాస్కర సత్యనారాయణ, నరసింహమూర్తి, పాటి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'ఆడుదాం ఆంధ్రా' రిజిస్ట్రేషన్లు



ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న అధికారులు

ఇరగవరం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొనే వారు గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి బి.వి.రమణ, ఎస్‌టీవీ రాజేశ్వరరావులు తెలిపారు. గురువారం ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా, ఇళ్ల నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావులు మాట్లాడుతూ 15ఏళ్ల పైబడిన వారంతా ఈ పోటీల్లో పాల్గొన వచ్చాన్నారు. ఖోఖో, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ వరప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్, డీసీఎంఎస్ డైరెక్టర్ పన్మెత్స సుబ్బరాజు, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగుల పిల్లలకు దాతలు సహాయ సహకారాలతో అన్నదానం చేశారు. దివ్యాంగుల పిల్లల విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమన్నారు. ముస్లిం కుటుంబ సభ్యులు షేక్ సాయినాక్, షేక్ రేష్మ, సాహిర్ ఇర్ఫాన్, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుస్థిర పాలన

- పేదలకు సంక్షేమం అందాలంటే జగనే రావాలి
- దోచుకున్నందుకే చంద్రబాబు జైలుకెళ్లాడు
- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మంత్రి కారుమూరి



తణుకు అర్బన్ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పేదవర్గాలకు పారదర్శకంగా సంక్షేమం అందాలంటే సీఎంగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 13, 14 వార్డుల్లో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భంలో ఉన్న శిశువు నుంచి మంచంపై ఉన్న వృద్ధుల వరకు సంక్షేమాన్ని అందిస్తూ చిన్న వయస్సులోనే ప్రజల మన్ననలు పొందుతున్న సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని అన్నారు. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పేదింటి విద్యార్థులను అమెరికా వరకు పంపించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యార్థుల ప్రతిభా పాటవాలు అమెరికాలో గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. రిక్షా, ఆటో డ్రైవర్ల పిల్లలు సైతం ఇంజనీర్లు, డాక్టర్స్, ఐఏఎస్ ఆఫీసర్లు అవుతున్నారంటే జగనన్న ప్రవేశపెట్టిన అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్దతోపాటు యూనిఫామ్, బూట్లు, టై, బ్యాగ్ వంటి సౌకర్యాలే కారణమన్నారు. అందుచేత రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే ఈ పథకాలన్నీ పారదర్శకంగా అమలవుతాయని అన్నారు.

దోచుకున్నందుకే చంద్రబాబు జైలుకెళ్లాడు..

చంద్రబాబు హయాంలో వందలాది కోట్లు దోచుకో దాచుకో అన్నట్లుగా వ్యవహరించి జైలు ఊచలు లెక్కపెట్టి వచ్చాడని ఎద్దేవా చేశారు. అమలు కాని 600 హామీలిచ్చిన చంద్రబాబు ఆతరువాత మ్యానిఫెస్టోని సైతం వెబ్‌సైట్ నుంచి తొలగించాడని విమర్శించారు. పేదలకు, పెత్తందార్లకు జరుగుతున్న యుద్ధంలో పేదలే గెలిచేలా జగనన్న ప్రయత్నం చేస్తున్నారని, టీడీపీ, జనసేన ఇతర పార్టీలన్నీ కలిసి కల్లబొల్లి మాటలు చెపుతూ ప్రజల ముందుకు వస్తున్నారని ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందుగా 13, 14 వార్డులకు సంబంధించి మంత్రి కారుమూరి జెండా స్థూపాలు ఆవిష్కరించి, పార్టీ జెండాలు ఎగురవేశారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పట్టికను ఆవిష్కరించి, సంక్షేమ బ్రోచర్‌లను మంత్రి కారుమూరి చేతులమీదుగా మహిళలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, 13, 14 వార్డుల నాయకులు దున్నాల ఉమామహేశ్వరరావు, మల్లుల సత్యనారాయణ, దుడే శ్రీనివాస్, కొఠారు రామాంజనేయులు, జాలేమి రవి, కోటి అదృష్టం, నత్తా మంగరాజు, పి.రమేష్, పవన్, సూరంపూడి కామేష్, పాట్ల సురేష్, నత్తా భాను, సుద్దుల పాండు, పుల్లెపు సూర్య చంద్రరావు, సామంతుల అప్పారావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా జగనే ఉండాలి

అత్తిలి: కులమత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు భవిష్యత్‌లో కొనసాగాలంటే రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డే ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు చెప్పారు. గురువారం సాయంత్రం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్య, వైద్యంతో పాటు అనేక సంక్షేమ పథకాలతో పాటు గ్రామాల్లో శాశ్వతమైన అభివృద్ధి పనులను చేపడుతూ మంచిపాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మీరంతా అండగా నిలవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విప్లవాత్మక పాలన అందిస్తున్నారన్నారు. ముందుగా వైఎస్సార్ పార్టీ జెండాను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఎగురవేసారు. సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, సర్పంచ్ చింతా రామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు దారం శిరీషా, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షులు పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాగిరెడ్డి రాజేంద్ర ప్రసాద్, వేంద్ర రాంపండు, పి సత్యనారాయణ, వెలగల సత్తిపండురెడ్డి, మద్దాల శ్రీనివాస్, రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, పోలినాటి చంద్రరావు, బొంతా యశోద, కంకటాల సతీష్ పాల్గొన్నారు.



ఇరగవరం : కావలిపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



పెంటపాడు: కొండేపాడులో సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తాడేపల్లిగూడెం రూరల్: సభలో మాట్లాడుతున్న నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జద్దు హరిబాబు

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఇరగవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు అన్నారు. గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం కావలిపురంలో నిర్వహించారు. ముందుగా పంచాయతీలో సంక్షేమ పథకాల బోర్డులను, వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన అందిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు రూ. 20 కోట్ల, 19 లక్షల, 49 వేల 899 లు లబ్ధి చేకూరిందన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి కోసం మళ్లీ సీఎంగా జగన్‌నే మళ్లీ గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎ శ్రీనివాస్, అధికారులు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, జెసిఎస్ కన్వీనర్ దినేష్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చోడే జోషి, సచివాలయ కార్యదర్శులు, వై మునిరాజు, సర్పంచ్ వనచర్ల అప్పన్న స్వామి, ఎంపీటీసీ పున్నం వెంకట లక్ష్మీ, ఉప సర్పంచ్ కరేళ్ళ నాగేశ్వరరావు సిబ్బంది, వలంటీర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

పెంటపాడు: పేదల, అభివృద్ధి సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెంటపాడు మండలం బి. కొండేపాడు, కోరిమిల్లి గ్రామాల్లో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల సర్పంచ్‌లు కట్టా దానయ్య, వల్లూరి సత్యవతిల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత గ్రామంలో సంక్షేమ అభివృద్ధిపై పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం రెండు గ్రామాల్లో పార్టీ జెండా ఎగురువేసారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్ష, గౌరవ అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు, గుండుమోగుల సాంబయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి నెరవేర్చని విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన అంశాలు నూరుశాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి జగనన్నే అన్నారు. మైలవరపు పెదబాబు, దేవరశెట్టి రాంబాబు, పాలా గణపతి, మర్రే కృష్ణమూర్తి, జానకి రామరాజు, దాట్ల రామలింగరాజు, వల్లూరి బ్రహ్మానందం, సొసైటీ అధ్యక్షుడు చుండూరి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఆర్బీకేలు

తాడేపల్లిగూడెం రూరల్: రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు వంటి వాటిని గ్రామంలోని ఆర్బీకేల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారని నవాబుపాలెం సొసైటీ చైర్మన్ జద్దు హరిబాబు అన్నారు. గురువారం మండలంలోని దండగర్ర సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ గతంలో వ్యవసాయ అవసరాల కోసం సమీపంలోని పట్టణాలకు వెళ్లవలసి వచ్చేదన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన తర్వాత రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల కష్టాలను తీర్చారన్నారు. ఆరుగొలను సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్ బాగుండాలంటే చదువు ప్రధానమన్నారు. అటువంటి విద్యను తమ పిల్లలకు అందించడానికి పేద కుటుంబాలు అనేక అవస్థలు పడేవన్నారు. ఈ క్రమంలోనే తమ పిల్లల్ని చదివించలేక పనుల్లోకి పంపించే పరిస్థితి ఉండేదన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా పేదలకు విద్యను అందుబాటులోకి తెచ్చారన్నారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం దండగర్ర, ఉప్పరగూడెం, లింగారాయుడిగూడెం, తాళ్ళపాలెం గ్రామాలకు సంబంధించి 38కోట్ల 52లక్షల ఎనిమిది వేల 313 రూపాయల విలువైన సంక్షేమ పథకాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా వెంకటరామారావు (రాంబాబు), ఎమ్పీటీసీ వీరమళ్ళ వెంకన్న, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, ఆర్బీకే చైర్మన్ ములగాల గంగారావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సచివాలయ కార్యదర్శులు అంకం శ్రీరామకృష్ణ, డి.శ్రీరామ్, జి.మానస, నాయకులు పత్సా బేబిరాణి, సత్తినీడి కొండలరావు, యాతం సత్యనారాయణ (పెద్దోడు), రాపాక అప్పన్న, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నదీజలాలతో భక్తాంజనేయునికి అభిషేకాలు



పూజలు చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, తాతాజీ కుటుంబ సభ్యులు

ఉంగుటూరు: భక్తాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబసభ్యులు ఉదయం నుంచి రాత్రివరకు నిర్విరామంగా పూజలు చేశారు. స్వామివారికి జలాభిషేకం పవిత్ర నదీ జలాలతో నిర్వహించారు. మహిళలు ఇళ్ల నుంచి బిందెలతో నీళ్లు తీసుకువచ్చి స్వయంగా అభిషేకాలు చేశారు. గ్రామ సంబంధ దోష నివారణకు ప్రభూత బలిహరణ కార్యక్రమాన్ని మంత్రి స్వయంగా ఎనిమిది దిక్కులు తిరిగి నిర్వహించారు. శివకేశవులు ప్రీతర్థ్యం కార్తీకమాసంలో జ్యోతులు వెలిగించటం జరిగిందని డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి వివరించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ, సాదిని కుమారి, కొట్టు తాతాజీ, కొట్టు విశాల్ దంపతులు పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోపీనాథపట్నం గ్రామ ప్రజలతో పాటు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజకవర్గాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో ఆ ప్రాంతం మార్మోమోగింది.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

శుక్రవారం ఉదయం 10.21 గంటకు భక్తాంజనేయ స్వామి ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, కుటుంబ సభ్యులు చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బాలోత్సవాల వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



తణుకులో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తణుకు: విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవాలు దోహదం చేస్తాయని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. గురువారం శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో బాలోత్సవాల పోస్టరును విడుదల చేశారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలని ప్రోత్సహించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ (అపుస్మా) తణుకు జోన్ అధ్యక్షుడు పెన్మత్స రామరాజు మాట్లాడుతూ వ్యాసరచన, వక్తృత్వం, స్పెల్, క్విజ్, మెమరీ టెస్ట్, చిత్రలేఖనం లాంటి అకడమిక్ అంశాలు, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, శాస్త్రీయనృత్యం, కోలాటం తదితర సాంస్కృతిక అంశాల్లో ఈ ప్రదర్శనలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా తణుకు శాఖ కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి నగేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు విద్యాకాంత్, పలు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం బాధ్యులు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిఎల్ నరసింహారావు, ప్రగతి విద్యా సంస్థల డైరెక్టర్ ప్రగతి రాజా పాల్గొన్నారు.


డ్వాక్రా మహిళలకు రుణాల మంజూరు



డ్వాక్రా మహిళలకు చెక్కులను అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం : స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడంలో ఎస్‌బీఐ ముందుంటుందని తాడేపల్లిగూడెం రీజనల్ మేనేజర్ సీజీవి రంగాచార్యులు, ఇరగవరం ఎస్‌బిఐ మేనేజర్ కె రవి అన్నారు. బుధవారం రాత్రి ఇరగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వయం సహాయక సంఘాలకు రూ. కోట్ల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ మహిళలు రుణ సదుపాయాలన్ని వినియోగించుకోని ఉన్నతంగా ఎదగాలన్నారు. బ్యాంకుకు సంబంధించిన సమాచారన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి యోనో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. బ్యాంకులకు సంబంధించి సిబిల్ సరిగా మెన్‌టేన్ చేస్తే ఎక్కువ రుణ సదుపాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఎంపీడీవో ఎ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి



డీఈఓ రమణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా ఎన్‌సీసీ డే సెలెబ్రేషన్స్ జరిగాయి. ముఖ్య అతిధిగా డీఈఓ ఆర్‌వీ రమణ హాజరై ఎన్‌సీసీ విద్యార్థులచే మార్చ్‌ఫాస్ట్ ద్వారా గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ భక్తి, క్రమ శిక్షణకు ప్రతీక ఎన్‌సీసీ అన్నారు. విద్యార్థుల్లో చదువులో క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణ సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని డీఈఓ ఆర్.వెంకట రమణ తెలిపారు. పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీ, డీ గ్రేడ్ విద్యార్థులు పాస్ అయ్యేలా సబ్జెక్టు టీచర్స్ నోట్స్ తయారు చేసుకొని వాటిని చదివించాలని సూచించారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

- మంత్రి కారుమూరి
- మంచిలిలో గడపగడపకు మన ప్రభుత్వం

అత్తిలి: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్రపౌరసరఫరాలశాఖా మంత్రికారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. అత్తిలి మండలం మంచిలి గ్రామంలో గురువారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అక్కడి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత కల్గిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు బటన్‌నొక్కి మీ ఖాతాకే జమ చేస్తున్నారని, ఇటువంటి సంక్షేమపాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. చక్కని పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మీరంతా అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి పండు ముసలివరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధిపొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ చింతారామయ్య, వైస్ ఎంపీపీలు దారం శిరీషా, సుంకర నాగేశ్వరరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు వేంద్ర రాంపండు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాగిరెడ్డి రాజేంద్రప్రసాద్, పసుపులేటి సత్యనారాయణ, వెలగల సత్తిపండురెడ్డి, బొంతా యశోద తదితరులు పాల్గొన్నారు.



అత్తిలి మండలం మంచిలిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

రేపు తణుకులో సెమీ క్రిస్మస్ వేడుకలు

తణుకు టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 2న జరిగే సెమీ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని యునైటెడ్ క్రిస్టియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ మనోజ్ బాబు కోరారు. శనివారం తణుకు మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈవేడుకల్లో మన్నా చర్చి పాస్టర్ జ్యోతిరాజు దైవ వర్తమానం అందిస్తారని చెప్పారు. తణుకు ప్రాంత క్రైస్తవుల ఐక్యత కోసం గత 30 ఏళ్ల క్రితం తణుకు పేట్టణానికి చెందిన బిషప్ మల్లిపూడి జాన్ తిమోతి ప్రారంభించిన సెమి క్రీస్మస్ వేడుకలను అదే స్ఫూర్తితో నేడు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో తణుకు ప్రాంతవాసులందరూ కుల, మతాలకు అతీతంగా పాల్గొవాలని కోరారు. ఈకార్యక్రమంలో యూసీఏ కార్యదర్శి బ్లస్సింగ్ రాజు, కోశాధికారి డేవిడ్ బాబు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మంచి ఆరోగ్యం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య బృందం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్యవంతమైన సమాజం ప్రజల చేతుల్లో ఉంటుందని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన కలిగించేందుకు వైద్య ఉద్యోగుల బృందం గురువారం డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని క్లస్టర్స్ 14, 15, 16 యానాదుల కాలనీలో ఆరోగ్య అవగాహన, వెక్టార్ కంట్రోల్ హైజీన్, డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగాం ఉంచుకోవాలన్నారు. దోమలు పుట్టకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రజలతో వైద్య ఉద్యోగుల బృందం సభ్యులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు.


నేడు షణ్ముఖి ఆంజనేయరాజు జయంతి

తణుకు: ఆంధ్రబాల గంధర్వ షణ్ముఖి ఆంజనేయరాజు 95వ జయంతి పురస్కార ప్రదానోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు షణ్ముఖి ఆజనేయ రాజు కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు రసరాజు, విజయషణ్ముఖి తెలిపారు. స్థానిక సురాజ్య భవన్‌లో జరిగే ప్రముఖ పౌరాణిక రంగస్థల నటీమణి గంటా మంగాదేవి అభినయంతోపాటు పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్‌టౌన్‌లోని నార్త్ సెక్షన్ పాతూరు 33/11 కేవీ సెమి ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పీ అండ్ టీ కాలనీ, మహాలక్ష్మీ నగర్ విద్యుత్ ఫీడర్‌లకు సంబంధించి మరమ్మతులు నిమిత్తం ఈ నెల 1వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. మసీద్ రోడ్డు, వివేకానంద బొమ్మ సెంటర్, జాన్సీరాణి ఆసుపత్రి ఏరియా, డీఎస్ చెరువు, పాతూరు, మహాలక్ష్మినగర్, చెట్లు రోడ్డు, సత్యవతినగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం: ఓటుహక్కు అర్హత కలిగిన ప్రతి ఒక్క విద్యార్థి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఏ.దుర్గేష్ పిలుపునిచ్చారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. యువతీ, యువకుల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కొత్త ఓటరు కార్డు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని పొందవచ్చన్నారు. డీటీ ప్రసాద్ మాట్లాడుతూ ఓటు వేసే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.